క్లుప్తంగా

మానవత్వంతో పేదలను ఆదుకోవాలి



గుండుగొలనులో దివ్యాంగులకు పండ్లు, బియ్యం అందిస్తున్న దాత, పెద్దలు

భీమడోలు: ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి పేదలకు ఆదుకోవాలని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం 60 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం జరిగింది. దాత దాట్ల రామకృష్ణంరాజు ఆర్థిక సాయంతో సన్నబియ్యం, పండ్లు అందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన దాత సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వందలాది మందికి భోజనాలు ఏర్పాట్లు చేసారు. నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీను, అరసంకేల సోములు, రావి గంగరాజు, నంబూరి సుబ్బరాజు, ఇందుకూరి రామరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

250 మంది విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన ఫాదర్ అమ్మన్‌రాజా

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం విచారణ పరిధిలో విద్యా వ్యాప్తికి, చర్యలు తీసుకుని విద్యార్థులకు విద్యతోపాటు పుస్తకాలు, పెన్నులు నూతన దుస్తులను అందిస్తున్నామని దెందులూరు ఆర్‌సీఎం విచారణ గురువు అమన్ రాజ అన్నారు. శనివారం ఆర్‌సీఎం చర్చి ఆవరణలో దెందులూరు గ్రామానికి చెందిన 250 మంది విద్యార్థులకు రూ.4 లక్షలతో నూతన వస్త్రాలను కొనుగోలు చేసి విద్యార్థులకు రెవరెండ్ ఫాదర్ అమన్ రాజా అందజేశారు.ఈ సందర్భంగా అమన్ రాజా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధి చెందాలని, చిన్ననాటి నుంచి సేవా, దయ, గుణం ఆధ్యాత్మికతతో మంచి మార్గం వైపు ప్రయాణం చేయాలని చిన్నారులను కోరారు. ఈ సందర్భంగా ఫాదర్ అమన్ రాజా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ గురువులు ఆర్ బాలరాజు ,కళ్యాణ్, తోట అజిత్, సంఘస్తులు పాల్గొన్నారు.

నృత్య పోటీల విజేతలు వీరే

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ 29వ వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జాతీయ స్థాయి నృత్యపోటీల విజేతల వివరాలను నిర్వాహకులు శనివారం ప్రకటించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆర్ ఉమా రాణి, కె.రాజ రాజేశ్వరీ దేవి, రఘుపాత్రుని శ్రీకాంత్, రమా కౌండిన్య శ్రీభాష్యం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. శనివారం వివిధ రాష్ట్రాలకు చెందిన నర్తకులు ప్రదర్శించిన విభిన్న నృత్యరీతులు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన శ్వేతా ప్రసన్న కూచిపూడి, భువనేశ్వర్‌కు చెందిన తనూజ కుమార్ పండా ఒడిస్సీ, వరంగల్‌కు చెందిన పెండ్యాల లక్ష్మీ ప్రియ కూచిపూడి, వన్నాల కస్తూరి పేరిణి లాస్యం, సూర్యాపేటకు చెందిన పి.సుమంత్ పేరిణి శివ తాండవం, కాకినాడకు చెందిన పి.పద్మిని ఆంధ్ర నాట్యం ప్రదర్శించి అలరించారు. వీరిని అభినయ నృత్య భారతి సంస్థ నృత్య కౌముది అవార్డులతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను అభినయ నృత్య భారతి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డి.హేమసుందర్ పర్యవేక్షించారు.

కూచిపూడి సబ్ జూనియర్స్

టి.ఓజస్విని (ప్రథమ), సి.మిషిక (ద్వితీయ) (అనంతపురం), దేదీప్య (తృతీయ) (అమలాపురం). ప్రోత్సాహక బహుమతులు మనస్విని (నరసాపురం), పి.రిషిక (హన్మకొండ), జనన్య వర్మ (వరంగల్), కాత్యాయని, మోక్షత (విజయవాడ), ధన్వి శ్రీ (తణుకు). ప్రత్యేక బహుమతులు భువన చంద్రిక (ఖమ్మం), తన్విత (విశాఖపట్నం), కె.ప్రణవి (అమలాపురం), సింధుజ ప్రియ (హన్మకొండ), తుస్య (ఏలూరు), లాస్యశ్రీ (తణుకు), గీతాన్షి శ్రీ (విజయవాడ), ఎ.ఆకాంక్ష (పాల్వంచ), ఆలియా (విజయవాడ).

జానపదం సబ్ జూనియర్స్

మిహిర ప్రేమమయి (ప్రథమ), ఎ.భవిష్య (ద్వితీయ) (ఏలూరు), వైష్ణవి విహారి (తృతీయ, హన్మకొండ). ప్రోత్సాహక బహుమతులు రిషిప్రియ (ఏలూరు), ధన్వి శ్రీ (తణుకు), దేవాన్స్ (ఏలూరు). ప్రోత్సాహక బహుమతులు సాయి సహస్ర, ఎ.విస్మయ వల్లిక (ఏలూరు), సింధుజా ప్రియ (హన్మకొండ).

183 మందికి వైద్య పరీక్షలు

ఏలూరు (టూటౌన్): స్థానిక శ్రీకృష్ణ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 183 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. పేద ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ప్రతి నెలా రెండో శనివారం క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ బి.కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంతా పొల్లు.. రైతు ఘొల్లు

- రైతులను ముంచిన 1318 రకం వరి
- 25 బస్తాల్లోపే దిగుబడి
- ప్రతికూల వాతావరణంతో ఫలితం తారుమారు
- అన్నదాతల ఆశలపై నీళ్లు



అదును దాటిపోయినా పూర్తిగా తయారుకాని వరి కంకులు (ఫైల్)

గణపవరం: సార్వా పంట రైతును దెబ్బమీద దెబ్బ కొట్టింది. సాగుచేసిన రైతుల్లో 75 శాతం మందికి పెట్టుబడులు కూడా దక్కలేదు సరికదా, భారీ నష్టాలు చవిచూశారు. ముఖ్యంగా 1318 రకం వరి రైతులను నిలువునా ముంచేసింది. ఈప్రాంతంలో రైతులు ఈ రకం వరిని సాగుచేయడం అరుదు. రెండోసారి నాట్లు వేయడానికి నారుమడులు వేస్తే ఆలశ్యమవుతుందన్న ఉద్దేశ్యంతో కొందరు రైతులు, జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి, పొరుగు జిల్లాల నుంచి రైతులు నారును కొని తెచ్చుకున్నారు. అక్కడ ఎక్కువగా 1318 రకం నారు దొరకడంతో రైతులు దానినే కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. ఎకరాకు రూ.5 నుంచి రూ.6 వేలు వెచ్చించి మరీ నారు కొని తెచ్చుకున్నారు.

దిగుబడిపై ప్రభావం

1318 రకం నారు నాటిన తర్వాత వరి దుబ్బుచేసి, ఈనిక వరకూ బాగానే ఉంది. అక్కడి నుంచే పరిస్థితి ప్రతికూలంగా మారింది. ఈనిక తర్వాత పాలుపోసుకునే దశలో వర్షాలు పడటంతో వెన్నులో ఎక్కువ గింజలు తోడుకోక పోవడంతో తాలుగా మారిపోయాయి. దీనితో దిగుబడి ఎకరాకు 25 బస్తాలు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఎక్కువగా 22 బస్తాల వరకూ దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు.

3 వేల ఎకరాల్లో సాగు

గణపవరం, నిడమర్రు మండలాల్లో 1318 రకం వరిని సుమారు మూడువేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ రకం వరి ఈ ప్రాంత రైతులకు పరిచయం లేదు. సార్వా నాట్లు వేసిన తర్వాత వరదలు రావడంతో వరినాట్లు కుళ్లిపోయాయి. దీనితో రైతులు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి ఈరకం నారు కొనుగోలు చేసి నాట్లు వేసుకున్నారు.

20 రోజులు ఆలశ్యంగా సాగు

ఈనిక వరకూ ఏపుగా దుబ్బు చేసి బాగానే ఉన్న వరి ఈనిక తర్వాత గింజ సరిగా తోడుకోలేదు. దీనితో వెన్నులో సగానికి సగం గింజ లేకుండా తప్పలుగా మారి దిగుబడి 25 బస్తాలు కూడా రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ముందుగా వేసిన నాట్లు వరదనీటిలో మునిగి పనికిరాకుండా పోవడంతో 20 రోజుల ఆలశ్యంగా రెండోసారి నాట్లు వేశారు. దీనితో ఈ రకం మాసూళ్లు ఇతర రకాలకన్నా 20 రోజుల ఆలశ్యమైంది. ఇప్పటికే 90 శాతం రైతులు మాసూళ్లు పూర్తిచేసి ధాన్యం విక్రయించుకోగా, మరికొందరు రైతులు ధాన్యం ఒబ్బిడి చేసి ఉంచారు. 1318 రకం వరి ఇంకా కోతకు రాలేదు. నాలుగైదు రోజుల్లో ఈరకం వరి మాసూళ్లు పూర్తయ్యే అవకాశం ఉంది.

అంతా నష్టమే



నేను మూడు ఎకరాల్లో 1318 రకం వరి సాగు చేశాను. ముందుగా వేసిన వరినాట్లు వరదల కారణంగా నీటమునిగి కుళ్లిపోయింది. మళ్లీ నారుమడి వేస్తే ఆలశ్యం అవుతుందన్న ఉద్దేశ్యంతో ఆకివీడు మండలానికి వెళ్తే 1318 రకం నారు దొరికింది. ఎకరాకు ఐదు వేలు, కిరాయి, కూలి ఖర్చులు కలిపి ఎకరాకు 8 వేల రూపాయల వరకూ ఖర్చయింది. ఇంతా చేస్తే ఈ రకం వరి తోడుకోక ఎక్కువగా తాలుగింజలు వచ్చాయి. రెండురోజుల్లో కోత కోయడానికి ఏర్పాట్లు చేస్తున్నాను. దిగుబడి ఎంత వస్తుందో అన్న దిగులు పట్టుకుంది.

– తానింకి శ్రీను, రైతు

వాసుబాబు పరామర్శ

గణపవరం: ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్న టీఎస్‌వీ రంగనాయకులు అకాల మరణం తీరనిలోటని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఆయన రెండు రోజుల క్రితం మరణించిన ఉపాధ్యాయుడు రంగనాయకులు భార్య, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామానికి చెందిన కోశెట్టి పెద్దిమ్మ ఇటీవల మరణించగా ఆమె కుటుంబ సభ్యులను వాసుబాబు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు రాము, జెడ్పీటీసీ సభ్యులు దేవారపు సోమలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వాణి వినిపించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో ప్రస్తావించాలని గోపిమూర్తిని ఏపీటీఎఫ్ 1938 నాయకులు కోరారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి శనివారం అమరావతిలోని రాష్ట్ర శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గోపిమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగులోతు కృష్ణ తదితరులు ఉన్నారు.

రాజీమార్గంలోనే కేసుల సత్వర పరిష్కారం



భీమడోలు కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి టీఎస్ఎస్ రిషి

భీమడోలు: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని మార్గమని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ టీఎస్ఎస్ రిషి అన్నారు. భీమడోలు కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు పరిధిలోని మండలాలకు చెందిన 40 కేసులను కక్షిదారులు, న్యాయవాదుల సమక్షంలో రాజీమార్గంలో పరిష్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి టీఎస్ఎస్ రిషి మాట్లాడుతూ చిరకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను రాజీమార్గంలో పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లు దోహదపడతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరుపక్షాలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాలి నాగేశ్వరరావు, లోక్ అదాలత్ సమన్వయకర్త ఎస్.గోపాలకృష్ణ, కార్యదర్శి బి.రాంబాబు, కోశాధికారి ఇంజేటి విజయ అచ్యుతం, సూపరింటెంటెంట్ రఘు, న్యాయవాదులు పానుకుమాటి రాజారావు, కాలి గంగరాజు, పంట్ల శ్రీను, ఉండి శశాంక్, భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



కైకరంలో నాగమ్మతల్లి గ్రామోత్సవ దృశ్యం

ఉంగుటూరు: కైకరంలో వేంచేసిన స్వయంభు శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం 90వ షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం పుట్టింటి వారు అద్దేపల్లి శేషయ్య ఇంటి నుంచి నాగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, చీర సారీ సమర్పించి పూజలు చేశారు. అత్తింటి వారైన శానం నరసింహారావు (బాబ్జి) కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి ఘనంగా అమ్మవారిని సాగనంపారు. తదుపరి అమ్మవారిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎలిశెట్టి చిన్ననాగ అన్నపూర్ణాదేవి, భక్తులు పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి ప్రారంభోత్సవం

దెందులూరు: దెందులూరులో నూతన సాల్వేషన్ ఆర్మీ చర్చిని సాల్వేషన్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ ఎం స్టాలిన్, వైఎస్ కేజీయా స్టాలిన్ శనివారం ప్రారంభోత్సవం చేశారు. గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పల్లె యోహాను చంద్రహాస కేటాయించిన స్థలంలో నూతన చర్చి నిర్మించారు. సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ జే మోషె ఆధ్వర్యంలో దెందులూరు కోర్ ఆఫీసర్ ఎం రమణయ్య అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దెందులూరు గ్రామానికి విచ్చేసిన రాష్ట్రీయ అధికారి ఎం స్టాలిన్, వైఎస్ కేజీయా స్టాలిన్లకు దెందులూరు బస్టాండ్ సెంటర్ నుంచి గౌడ వీధిలోని నూతన చర్చి వరకు సంఘస్తులు గృహ సమితి సభ్యులు సండే స్కూల్ చిన్నారులు ఘన స్వాగతం పలికారు. నూతన చర్చి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కల్నల్ దంపతులు అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ టీ శ్యాంబాబు, రిటైర్డ్ ఆఫీసర్ జోషియా, కోర్ ఆఫీసర్లు సంఘ సభ్యులు ఉన్నారు.



చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా సంఘ పెద్దలను సన్మానిస్తున్న దృశ్యం

ఘన సన్మానం : నూతన చర్చి స్థల దాతలు పల్లె హర్షవర్ధన్ సిలువ కుమారిని కల్నల్ దంపతులు డివిజనల్ కమాండర్ దంపతులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం పల్లె హర్షవర్ధన్ దంపతులు యుగంధర్ అనితా కుటుంబ సభ్యులు లెఫ్టినెంట్ కల్నల్ దంపతులను సన్మానించి జ్ఞాపకను అందజేశారు.

బోదవ్యాధితో తీవ్ర దుష్ఫలితాలు



అర్థవరంలో బోదవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: బోదవ్యాధి ప్రాణాంతకం కాకున్నా, దాని వల్ల కలిగే దుష్ఫలితాలు తీవ్రంగా ఉంటాయని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. శనివారం గణపవరం మండలం అర్థవరంలో మైక్రోఫైలేరియా సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోదవ్యాధి హెల్మెంత్ వర్గానికి చెందిన సన్నని పరాన్నజీవి కారణంగా కలుగుతుందన్నారు. వ్యాధి సంక్రమణను సరిగ్గా అంచనా వేయడం, ప్రాథమిక దశలో గుర్తించడం సాధ్యం కాదని అన్నారు. ఈవ్యాధి నుంచి విముక్తికి మార్గం లేదని, ఇది రాకుండా చూసుకోవడమే ఉత్తమమని అన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ బోదవ్యాధి సోకిన వారికి వ్యాధినిరోధక శక్తి క్షీణించి, ఇతర వ్యాధులు సులభంగా సోకే అవకాశం ఉంటుందని అన్నారు. ఈవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి పూర్తిగా వ్యతిరేకమని మాల సంఘాల ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జేఏసీ ఏలూరు జిల్లా నాయకులు అభిప్రాయపడ్డారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చని, ఇచ్చిన సూచనను వ్యతిరేకిస్తూ మాల సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 15వతేదీ ఆదివారం గుంటూరులో మాలల గర్జన మహాసభ పేరిట భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసినట్లు చెప్పారు. హలో మాల.. చలో గుంటూరు నినాదంతో ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 గురించి పార్లమెంట్‌లో చర్చ జరగకుండా, రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా, సుప్రీంకోర్టు సూచన విచారకరమని తెలిపారు. దీనిని ఖండిస్తూ నిర్వహించే బహిరంగ సభకు లక్షలాది మంది తరలి రావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద కులంగా మాలలు ఉన్నారని, దాదాపు కోటి మంది మాలలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మెండెం సంతోష్ కుమార్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ కుమార్, ప్రొఫెసర్ ఎస్ ఏడీ పాల్, దాసరి ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



మల్లవరం గంగానమ్మ ఆలయ ప్రతిష్ఠలో భాగంగా పూజలు చేస్తున్న పుప్పాల వాసుబాబు తదితరులు



వాసుబాబును సత్కరిస్తున్న కమిటీ పెద్దలు, నిర్వాహకులు

భీమడోలు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. చెట్టున్నపాడు పంచాయతీ శివారు మల్లవరంలో గ్రామస్తులు, దాతల ఆర్థిక సాయం రూ.45 లక్షలతో నిర్మించిన శ్రీగంగానమ్మ ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో సిద్ధాంతి బ్రహ్మశ్రీ బాదంపూడి వెంకటరత్నం వేద పండితుల బృందంతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన శనివారం వేదమంత్రోచ్ఛరణల నడుమ పూజలు నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొల్లేరు ప్రాంతంలోని ప్రజల్లో దైవ చింతన అమోఘమని, అందరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని కోరారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పెద్దలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనుమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, కమిటి పెద్దలు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కొవ్వలి విద్యార్థి



విద్యార్థి చార్లెస్ వెస్లీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు 49వ సబ్ జూనియర్స్ బాలుర, బాలికల జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్ఎస్‌జీ శర్మ అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చార్లెస్ వెస్లీ గత నెల 9, 10,11 తేదీల్లో రామచంద్రాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. విద్యార్థి చార్లెస్ వెస్లీని పీడీలు గవ్వా శ్రీనివసరావు, ఓ.సురేష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

1,421 మంది గ్రాడ్యుయేట్ల ఓటు నమోదు

ఉంగుటూరు: మండలంలో 1,421 మంది గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదయ్యారని ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దారు పోతురాజు శనివారం తెలిపారు. మొదటి దశలో మొత్తం 1,645 దరకాస్తులు అందాయని అందులో 224 దరకాస్తులు రిజెక్టు అయ్యాయని తెలిపారు. రెండో దశలో 191 దరఖాస్తులు అందాయని, ఆఫ్‌లైన్‌లో 60 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. వాటిని విచారించాల్సి ఉందని డిప్యూటీ తహసీల్దారు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం



నిడమర్రులో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల ప్రత్యేక అధికారి ఎంవీఎస్ కృష్ణప్రసాద్



అంబర్‌పేటలో ఎన్నికల సిబ్బందికి సూచనలందిస్తున్న తహసీల్దార్ బి.రమాదేవి

భీమడోలు: మండలంలోని 11 మేజర్, మైనర్ సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. అంబర్‌పేట, పోలసానిపల్లి సాగునీటి వినియోగదారుల సంఘాల నామినేషన్ల ప్రక్రియను తహసీల్దార్ బి.రమాదేవి పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియను పాటించాలని పోలింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలని వారిని కోరారు. మండల వ్యాప్తంగా భీమడోలు, పూళ్ల, గుండుగొలను, ఆగడాలలంక, చెట్టున్నపాడు, అంబర్‌పేట, పోలసానిపల్లి, దుద్దేపూడిలోని మేజర్, మైనర్ సాగునీటి సంఘాల్లో 102 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా ఆరు స్థానాలకు ఎటువంటి నామినేషన్లు దాఖాలు కాలేదు. మిగిలిన 96 సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిలో నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. చెట్టున్నపాడు నీటి సంఘంలో నాలుగు స్థానాలు, అంబర్‌పేటలో రెండు స్థానాలకు నామినేషన్లు వేయలేదు. దీనితో పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి నాయకులు నీటి సంఘాల పదవులను పంచుకున్నారు. వారికి పోలింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించారు. అనంతరం కూటమి నాయకులు నూతనంగా ఎన్నికైన వారిని అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

ఉంగుటూరు : మండలంలో సాగునీటి సంఘాలకు శనివారం ఏకగ్రీవంగా డైరక్టర్లను, అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. నిర్ధేశించిన పాఠశాలల వద్దకు చేరకున్న రైతులు ఏకగ్రీవంగా ఎన్నిక జరిపించారు. గోకవరం, బొమ్మిడి, చేబ్రోలు, దొంతవరం, కైకరం, కైకరం, నల్లమాడుచెరువు, పట్టెమ్మ చెరువు, గోపీనాథపట్నం పెద్దట్యాంకు, రాచూరు, ఉంగుటూరు, వెల్లమిల్లి వీరభద్రుని చెరువుకు సంబంధించి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు.

గణపవరం మండలంలో ప్రశాంతం

గణపవరం: గణపవరం మండలంలోని నాలుగు నీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మొత్తం 48 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఎస్సై మణికుమార్ పర్యవేక్షించారు. ఈ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు దూరంగా ఉన్నాయి. టీడీపీ, జనసేన నాయకులు పదవులను పంచుకున్నారు. జల్లికొమ్మర, అర్థవరం, కాశిపాడు, మొయ్యేరు నీటి సంఘానికి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మెంబర్లను ఎన్నుకున్నారు.

48 మంది సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

గణపవరం: గణపవరం మండలంలోని నాలుగు నీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మొత్తం 48 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఎస్సై మణికుమార్ పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఆ పార్టీ శ్రేణులు ఎన్నికకు దూరంగా ఉన్నాయి. తెదేపా, జన సేన నాయకులు పదవులను పంచుకున్నా రు. జల్లికొమ్మర, అర్థవరం, కాశిపాడు, గుండుగొలను, మొయ్యేరు నీటి సంఘాలకు ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు

నిడమర్రు: నిడమర్రు మండల పరిధిలోని 6 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా, ప్రశాంతంగా పూర్తయినట్టు ఎన్నికల ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ డీఈ ఎంవీఎస్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 72 టీసీ సభ్యులను ఎన్నుకున్నారన్నారు. వారంతా ఆయా గ్రామాల్లోని నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అడవికొలను డీసీకి, చానమిల్లి, పత్తేపురం, నిడమర్రు, పెదనింద్రకొలను, వెంటాపురం, నీటి సంఘాలకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తాహసీల్దారు నాగరాజు తెలిపారు. ఈ ఎన్నికలను ఇరిగేషన్ శాఖ ఏఈలు జి, రాము పర్యవేక్షించారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: మండలంలో సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికల్లో అన్ని సాగునీటి సంఘాలు టీడీపీ కైవసం చేసుకున్నాయి. ఎన్నికలను దెందులూరు తహసీల్దార్ బి.సుమతి ఎన్నికలను పర్యవేక్షించారు. దెందులూరు, గోపన్నపాలెం, కొవ్వలి, దోసపాడు, సానిగూడెం సాగునీటి సంఘాలకు అధ్యక్షులను, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కొప్పాక నీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవం

పెదవేగి : కొప్పాక నీటికాలువ నీటి వినియోగదారుల సంఘ ఎన్నిక ఏకగ్రీవమైంది. కొప్పాక నీటి సంఘ ఎన్నికలు స్థానిక జెడ్పీ హైస్కూల్లో శనివారం అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు.

బాలబాలికలు క్రీడల్లో రాణించాలి

ఏలూరు రూరల్ : కరాటే, కుంగ్‌ఫూతో పాటు క్రీడల్లో బాలబాలికలు రాణించాలని ఆక్స్‌ఫర్డ్ స్కూల్స్ ఆర్ఐ ఉషారాణి అన్నారు. శనివారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ఎంతో కృషి చేస్తున్నట్టు చెప్పారు. స్పోర్ట్స్ డే నిర్వహించి ఆటలపై ఆసక్తి పెంచుతున్నామన్నారు. బాలబాలికలకు అథ్లెటిక్స్ విభాగంలో పలు పోటీలు నిర్వహించి, విజేతలకు మెడల్స్, బహుమతులు స్కూల్స్ చైర్మన్ ఫ్రాన్సిస్, ప్రిన్సిపాల్ ఐవీ సుధాకర్ చేతుల మీదగా బహుమతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయ్‌భాస్కరరెడ్డి, జోసఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.